మధుర మీనాక్షి

శ్రీ ఆర్. ఎస్. సుదర్శనం

దక్షిణాదికి వెళ్లాలనిపించింది. ముఖ్యంగా మధురకు. మధుర అనే పేరూ, మధురలో అమ్మవారు మీనాక్షి పేరూ అంటే నాకేదో యిష్టం. ఇరవై ఏళ్ల క్రితం నేను మద్రాసులో చదువుకునేటప్పుడు మధుర నుంచీ వచ్చిన స్నేహితుడు ఒక డుండేవాడు. అతడు నాతో తెలుగులో మాట్లాడటానికి ప్రయత్నించేవాడు. వాళ్లింట్లో తెలుగు మాట్లాడుతారట. కాని ఆ తెలుగు స్వరూపం వింతగా ఉండేది. ఆ తెలుగుని నాముందు తప్ప అందరి ఎదుటా ప్రదర్శించేందుకు బిడియ పడేవాడు నా స్నేహితుడు. మా మధ్య చనవు ఎక్కువయ్యాక అతని మాతృభాషఅయిన ఆ తెలుగు—కాని—తెలుగులోనే నాతో మాట్లాడేవాడు. అందువల్ల మా స్నేహం ఎంతో ప్రియమైనదిగా ఉండేది. కాలేజి వదిలాక మామధ్య రెండేళ్లపాటు ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగినా, తర్వాత అతనెక్కడున్నాడో నాకు తెలీదు. భాషా ప్రయుక్త రాష్ట్రాలు వచ్చాక ఎవరి ప్రపంచం వారిదై పోతూవచ్చింది. ఇప్పుడు దక్షిణాదికి వెళ్లాలనిపించగానే ఆనాటి ఆ మధుర స్నేహితుడు—అతనిపేరు గురుమూర్తి—జ్ఞాపకంవచ్చి, స్నేహంకంటె తియ్యనిది జీవితంలో మరొకటిఉందా! అనిపించింది.

నేను వెళ్లాలనుకున్నది యాత్రగాకాదు, పుణ్యం మూటకట్టుకుందామన్న ఉద్దేశంతోకాదు. ఒక్కసారి నా పరిసరాల్నీ, నాకు నిత్యమూ సంబంధంఉన్న మనుష్యుల్నీ, నేను నిత్యమూ వింటూన్న భాషనీ వదలి పెట్టి కాస్త స్వేచ్ఛగా క్రొత్త వూపిరి పీల్చుకునేందుకు వీలుగా, నా కెవ్వరూ తెలీని ప్రదేశానికివెళ్లి గడపాలనే కోరికే నన్ను ప్రయాణానికి పురికొల్పింది.

కాలేజి చదువు అయ్యేదాకా నా జీవితంలో ఒక అధ్యాయం, అటుపైన గడచిన ఇరవై ఏళ్లుగా మరొక అధ్యాయం. రెండేళ్లక్రితం నా భార్యపోవటం, నా నలుగురు పిల్లలూ ప్రస్తుతానికి బోర్డింగు స్కూళ్లల్లో నిక్షేపంగా చదువుకుంటూ ఉండటం, నాలో ఏర్పడిన ఒంటరితనం, క్రమంగా నా దృక్పథంలో ఒక పరివర్తన తీసుకునివచ్చింది. వ్యాపారంలోనేమి, వ్యవహారాల్లోనేమి పూర్తిగా మునిగిపోయిఉండటం, ఎప్పుడూ క్షణం తీరిక లేకపోవడంమూలాన ఈ నా 'ఒంటరితనాన్ని' సులువుగా నేను గుర్తింపలేదు. కాని మధ్య మధ్య ఒక్కొక్కసారి నాలో ఏదోపరధ్యానంలాంటి మనఃస్థితి కల్గి, నేను పరిసరాల్ని మరచిపోయి, కాస్సేపటికి మళ్లీ స్పృహ రావటంలాంటి సన్నివేశాలు కొన్ని కలిగాయి. ఒకసారి ఒక డాన్సు ప్రోగ్రాం చూడటానికి వెళ్లాను స్నేహితులతో. నృత్యం మనస్సుకి పట్టలేదు సరికదా, ఉన్నట్లుండి ఏదో దిగులు, శూన్యం, ప్రవేశించి సుమారు ఒక గంటకాలం నాకూ పరిసరాలకూ సంబంధంలేని స్థితి ఏర్పడ్డది. తర్వాత ఒకసారి స్నేహితులతో క్లబ్బులో పేకాడుతూఉండగా ఉన్నట్లుండి విరక్తిలాంటిదేదో కల్గి ఆటలోంచి లేచి వెళ్లిపోయాను. అదృష్టవశాత్తూ నేను అప్పటికి ఆటలో ప్లస్‌లోనే ఉన్నాను కాబట్టి మిత్రులు అపార్థం చేసుకోలేదు. అలావెళ్లి బాతురూమ్‌లో ముఖం కడుక్కునివచ్చి, వేరుగా కుర్చీ వేసుకుని కిటికీలోంచి ఆకాశాన్ని చూస్తూ కూర్చుండిపోయాను. అదెంతో హాయి అనిపించింది. ఇటువంటి 'మూడ్సు' తరచు వస్తూ వస్తూ, చివరకి, నే నిందాకా చెప్పినట్లు, ఎక్కడికైనాసరే, ఎవరితోనూచెప్పకుండా కొన్నిరోజులు వెళ్లి తిరిగి రావాలన్న గాఢమైన వాంఛ నాలో రూపొందింది.

కాని ఎవరితోనూ చెప్పకుండా వెళ్లడంలో ఎన్నో చిక్కులున్నాయి. నిజంగాచూస్తే సన్యసించి వెళ్లిపోదామనే ఉద్దేశంలాంటిది నాలో ఏ కోశానా లేదు! పిల్లలమీద ప్రేమా, వాళ్ల భవిష్యత్తుమీద ఆసక్తి నాలో అధికంగా ఉన్నాయి. వ్యాపార విష

యాల్లో నా ప్రమేయంలేనిదీ, నా జాగ్రత్తలేనిదీ అన్నీ సవ్యంగా జరుగుతూ ఉంటాయనే నమ్మకమూ నాకులేదు. అందువల్ల ఏదో మామూలు కారణం లాంటిది చూపిస్తూ ఎవరెవరికి ఏమి చెప్పాలో చెప్పి వెళ్లడమే మంచిదని తోచింది. కాని నా 'మూడ్స్' విషయం, నా అసలు రహస్యంమాత్రం ఎవరికీ చెప్పే పరిస్థితిలోలేను. మిత్రులుగాని బంధువులుగాని నన్ను పిచ్చివాడినిగా జమకట్టుతారని భయం! అందువల్ల నేను దక్షిణాదికి యాత్ర వెడుతున్నాననీ, ముఖ్యంగా నా భార్య అస్థికల్ని రామేశ్వరం తీసుకువెళ్లాలన్న కోర్కె నాలో ఉన్నదనీ, తీరికలేక ఇంతకాలం వెళ్లలేకపోయాననీ, అందరితో లోకరీత్యా చెప్పవలసి వచ్చింది.

"అయితే పెద్దబ్బాయినైనా తీసుకువెళ్లరాదా" అని కొందరు సలహా యివ్వకపోలేదు. "వాడికి సెలవులు వచ్చేదాకా ఆగితే నాకు తీరిక చిక్కదుకదా! ఇప్పుడనుకున్నాను. ఇప్పుడేవెళ్ళి రావటమే మంచిది" అని సమాధానం చెప్పాను. ఆలస్యంచేస్తే వాళ్లూ వీళ్లూ వెంట బయలుదేరుతారేమోనని అనుకున్న మూడోరోజే రైలెక్కాను, ఒక చిన్న సూట్‌కేసుతో.

రైల్లో కూర్చోగానే నాకో ప్రశ్న ఎదురైంది: ఏమిటి నేను చేస్తున్న ఈ పిచ్చిపని? ఈ అర్థంలేనిపని? నే నెందుకు మధుర వెళ్తున్నానో నాకే తెలీదుకదా! అనిపించింది. మామూలు వ్యవహారాల్లో మునిగి ఉన్నంతసేపూ, అందులోనుంచీ బయటపడాలనే ఏదో ఒత్తిడివల్లా, 'మధుర' అనే పదం అంటే ఏదో యిష్టం ఉండటంవల్లా, బయలుదేరానేకాని అలా బయటపడి మధుర చేరుకున్న తర్వాత ఏమి చెయ్యాలి? అనే విషయం మాత్రం నాకు స్పష్టంగాలేదు. రైల్లోకూర్చుని ఆలోచిస్తే అంతాబోధపడుతుందనికాబోలు అభిప్రాయపడ్డాను. కాని తీరాచూస్తే ఎంత ఆలోచించినా, ఏం చెయ్యాలో యిదమిద్ధమని తేలటంలేదు. పోనీ, ఎప్పుడు చూడని మధురనుచూచి, మీనాక్షి దేవాలయాన్నీ తిరుమలనాయకుని మహల్నీచూచి రెండు మూడురోజుల్లో వచ్చేద్దామనుకున్నాను. అందుకోసమైతే మిత్రులతో కలిసి వెళితే బాగుండేదికదా అన్న కొరత మనసుకు తట్టింది. మళ్లీ మిత్రులా? అసలు తెలుగుభాషేవద్దు, తెలిసిన జీవితమే వద్దు, అన్నీ మరచిపోయి స్వేచ్ఛగా ఉండాలనికదా నా ఉద్దేశం! పోనీ గురుమూర్తి ఎక్కడున్నాడో అన్వేషిద్దామా? మధురవంటి పెద్ద పట్టణంలో పాత అడ్రస్ అయినా గుర్తులేని ఒకానొక గురుమూర్తిని ఎలా పట్టుకోవడం? పైగా విచిత్రం, గురుమూర్తికోసం కష్టపడి వెదకడంలో కూడా నాకు ఆసక్తిలేదని తేలిపోయింది! యాదృచ్ఛికంగా గురుమూర్తి కనిపిస్తే అది వేరే సంగతి. అప్పుడు సంతోషమే! కాని అతణ్ణి వెదకటానికికాదుగా నేను మధుర వెళ్తూండటం! పోతే, భక్తి, పుణ్యము, తీర్థసేవ అంటే అటువంటివాటిమీద నాకు అసలు నమ్మకంలేదని మొదటే చెప్పాను.

ఇలా ఆలోచిస్తూ, ఏమీ పాలుపోక, వూరికే ఎక్కి దిగే మనుష్యుల్నీ, రైల్వే స్టేషన్లనీచూస్తూ కూర్చున్నాను. అలా చూడటంలో నాకు కొన్ని కొత్త సంగతులు తెలిసినవి. సాధారణంగా మనం మనుష్యుల్ని ఒక అర్థంతో చూస్తూఉంటాము. వీడు ఫలానా, వీడితో యీపని, ఈమె ఫలానావారి తాలూకు, ఈమె గుణం యిలాంటిది అన్న దృష్టి వ్యక్తుల్ని గూర్చిన పరిచయంమూలాన, నిత్యమూ కొన్ని ప్రయోజనాల్ని అన్వేషిస్తూ వ్యవహారదృష్టితో చూస్తూండటంతప్ప, ఆ యా వ్యక్తుల్లోఉన్న వింతలూ, చమత్కారాలు మనం గమనించము. అదీకాక మనిషి మామూలు మనిషి అన్నభావంతోగాక ఒక యంత్రము, ఒక బొమ్మ, ఒక వింత మృగము అనే దృష్టితో చూస్తే మరికొన్ని చమత్కారాలు కనిపిస్తాయి. రైల్లో నా ఎదురుగా ఒక కుటుంబం, అంటే భార్యాభర్తలూ వాళ్ల ఆరేళ్ల కూతురూ కూర్చున్నారు.చూడగానే వాళ్ల పరస్పర సంబంధం వగైరాలు అర్థమయినవి. కాని నా మనస్సు ప్రస్తుతం అనుభవిస్తున్న వింతస్థితిలో వాళ్లకు ఒకరితో ఒకరికి సంబంధం లేదనుకుంటూ వాళ్లను గమనించాను. ఆ అవగాహన అద్భుతంగాఉంది. ఎవరికివాళ్లు ఒంటరి వాళ్లే, నాలాగ. పైన ఏవో శబ్దాలూ, చేష్టలూ, వాటికి ఏవో అర్థాలూ, ఆ అర్థాల మూలంగా మనస్సులో ఒక ఎడతెగని భ్రమ! అంతే! భర్త కొన్ని నిముషాలు మరుగుదొడ్డిలోకి వెళ్లాడు. వెంటనే భార్య హావభావాల్లో మార్పు కనిపించింది. నావైపు సిగ్గువిడిచిఆసక్తిగా, సాహసంగా, పరిశీలనగా చూచింది. అటూ, ఇటూ కదిలింది, వస్తువుల్ని సవరిస్తూ కూతురితో ఏదో అన్నది. నాకూ ఏదో వ్యక్తం చేసింది. భర్త తిరిగివచ్చి కూర్చున్నాడు. ఆమె మళ్లీ పూర్వం ధోరణిలో 'అణ

కువ' (Subdued) గా, స్తబ్ధంగా మారింది. భర్త సాన్నిధ్యం ఆమె నిజస్వరూపాన్ని కప్పిపెడుతూ ఉన్నట్లు నాకు తోచింది. ఇందులో ఆమె భర్తను ఏదో మోసంచేస్తూ ఉన్నదనీ, కపటంగా ప్రవర్తిస్తున్నదనీ నా ఆరోపణకాదు! నైతిక వ్యతిక్రమణం ఏమీ లేదు. ఆమె వ్యక్తిత్వంమాత్రం భర్త ఎదురుగుండా ఉండటంవల్ల ఒకానొక ధోరణిలోనూ, లేకపోయిన క్షణాలలో మరొక ధోరణిలో అంటే స్వేచ్ఛగానూ ఉంటుందనేది నాకు నిశ్చయంగా తెలిసింది. ఆమెలోని ఆ రెండవ ధోరణి, దాని సౌందర్యం ఆ భర్తకు ఎన్నడూ కనిపించదు, ఊహామాత్రంగా కూడా అంతు చిక్కదు. ఇదీ జీవితంలో వ్యక్తులమధ్య ఉండే సంబంధాల్లోని వైచిత్రి. కేవలం భార్యా భర్తలమధ్యేకాదు. ఒకానొక రామారావు నాకు చాల సౌమ్యుడుగా, ఓర్పుగలవాడుగా మాత్రమే తెలుసు. మరొకరికి రామారావు అంటే ముంగి, లోపలి మనిషి, నమ్మదగినవాడుకాడు. ఈ విభేదాలు ఎందువల్ల వస్తున్నాయి?

నా ఆలోచనలకు గమ్యంలేదు. నాకు తోచిన ప్రశ్నలకి నేను సమాధానం వెదకలేదు. చివరకు నిద్రపోయాను. తెల్లవారింది. మధుర స్టేషనులో దిగాను. బండివాణ్ణి మంచి హోటలికి తీసుకువెళ్లమన్నాను. 'రాయల్ లాడ్జి'ట. ఎందుకో కృష్ణదేవరాయలు జ్ఞాపకం వచ్చాడు. రాయలవారికి అతిథిని, 'పేయింగ్ గెస్ట్'ని అనుకున్నాను.

హోటలు మేడమీదికి మీనాక్షి దేవాలయ గోపురాలు కనిపిస్తున్నాయి. అక్కడికి దగ్గరే. సర్వరును అడిగాను. పూజ ప్రొద్దున ఎనిమిదింటికే ముగుస్తుందట. సాయంకాలం వెళ్లమన్నాడు. దేవాలయ ప్రాకారానికి నాలుగు ద్వారాలు. ద్వారాల గోపురాలు అందంగా మెరుస్తూ కనిపిస్తున్నాయి. పునరుద్ధరణ యిటీవలే జరిగిందట. శివగంగరాజాగారు కాబోలు డబ్బిచ్చారట. తిరుమల నాయకుని మహల్ విషయం అడిగితే అది చాలదూరం, ఒక కొసను ఉందనీ, అక్కడికైతే యిప్పుడే వెళ్లి రావచ్చుననీ సర్వరు సలహా యిచ్చాడు. బండీ చేసుకుని అక్కడికి వెళ్లాను. ఏవో గవర్నమెంటు ఆఫీసులు ఆక్రమించేశాయి ఆ మహల్ని. మేడమీదికి వెళ్లి తిరిగాను. మధురాపట్టణం చాల వరకు కనిపిస్తుంది. ఎందుకో నాకు తృప్తిగాలేదు. మధుర వచ్చింది యిందుకా? అనుకుంటూ హోటలికి తిరిగి వచ్చాను. భోజనంచేసి నిద్రపోయాను.

సాయంత్రం అయిదు గంటలకిగాని మెలకువ రాలేదు. కాఫీత్రాగి దేవాలయానికి బయలుదేరాను. ద్వారం దగ్గర కొబ్బరికాయ, కుంకుమ వగైరా సామగ్రికొని లోపలికి వెళ్లాను. చక్కని సన్నాయి చెవినబడ్డది. లోపల పుష్కరిణి శిల్పాలు ఎంతో అందంగా ఉన్నాయి. ఎవరో అమెరికను దంపతులు శిల్పాలని చూస్తున్నారు. ఒక పధ్నాలుగేళ్ల కుర్రవాడు వాళ్లకి 'గైడు'గా వ్యవహరిస్తున్నాడు. అటుపైన అమ్మవారి గుడి. 'హిందువులకు మాత్రమే ప్రవేశము' అన్నబోర్డు. అమెరికనులు ఆ హద్దుదాటి పోరాదు!

లోపల మరొక హద్దు. అమ్మవారిని దగ్గరిగా చూడటానికి వెళ్లాలంటే మొలకు గుడ్డతప్ప ఒంటిమీద గుడ్డ ఉండరాదు. చాలమంది అంగవస్త్రంతో వచ్చి, ఆ వస్త్రాన్ని నడుముకు చుట్టుకొని లోపలికి వెళ్తున్నారు. స్త్రీలకు ఈ విధిలేదు. నేను చొక్కా బనీను విప్పటానికి సిద్ధంగా ఉన్నా, అవి ఎక్కడ పెట్టాలో తెలీక, లోపలికి వెళ్లడం మానుకున్నాను.

అర్చన జరిగినంతసేపూ వెలుపలే నిల్చుండిపోయాను. అమ్మవారు లీలగాతప్ప స్పష్టంగా దృష్టికి ఆనలేదు. ఆలయంయొక్క గంభీరవాతావరణం నన్ను ఆకట్టుకున్నది. కాలం ఘనీభవించినట్లు, కాలసముద్రం లోతుల్లోకి మునిగినట్లూ, చరిత్రలో ఏదో వెనక్కి వెనక్కి వెళ్లినట్లు ఒక విశేషమైనభావం మనస్సును ఆవరించింది.

మెల్లగా అడుగులు వేసుకుంటూ తిరిగివస్తూ ఉన్నాను. ఎందుకో వెనక్కి తిరిగిచూడాలనిపించింది. చూశాను. ఒక అందమైన యువతి నా వెనుకే వస్తోంది. నేను తిరిగి చూచిన క్షణంలో మాచూపులు కలిసికొన్నాయి. నేను ముందుకు సాగాను. నడకవేగం తగ్గించాను. కాని నే నుద్దేశించినట్లు ఆమె నన్నుదాటి ముందుకు వెళ్లలేదు. ఆమె కూడా మెల్లగానడుస్తూ మా యిద్దరిమధ్యా ఒకే దూరాన్ని అట్టే పెట్టుతున్నదని తెలిసింది. ద్వారం దగ్గర అంగళ్లున్నాయి. అక్కడ పూజా సామగ్రి కొన్నప్పుడు వాళ్లిచ్చిన వెదురుపళ్లెం వాళ్లకిచ్చివెయ్యాలి. అక్కడే వదలిన నా చెప్పుల్ని

తొడుక్కోవాలి. అందుకోసం ఆగాను. ఆగి వెనుక వస్తున్న ఆమెకోసం చూశాను. ఆమె సూటిగా నా కళ్లల్లోకి చూచింది. ఏదో నవ్వీనవ్వనట్లుగా అందులో ఒక చిరునవ్వు కూడా నా క్కనిపించింది. నేను పళ్లెం యిచ్చివేసి తొందరగా చెప్పులుకోసం వెదుక్కొన్నాను.

నన్ను ఆకర్షించిన అందంగల ఆ యువతి నాతో మాట్లాడ్డానికి సుముఖంగా ఉన్నదన్న నమ్మకం నాలో కల్గిన తర్వాత, మరి నేను ఆగలేకపోయాను. చెప్పులు నావి నాకు కనిపించటంలో కొంత జాప్యం తప్పలేదు. పెద్ద జాప్యం ఏమీకాదు. గబగబా వీధిలోకి వచ్చాను. కాని ఆమె అంతలో ఎటు వెళ్లిందో నాకు కనిపించలేదు. ఇటూ అటూ వీధి తిన్నగా కనిపిస్తు వుంది. ఆ కొద్ది నిముషాల్లో కనుచూపుమేరదాటి మలుపుతిరిగి ఉండటం సాధ్యంకాదు! అయితే మరి ఆమె ఏమైనట్లు?

ఆ వీధి పొడవునా, పరిసరాలూ చీకటిపడేదాకా వెదుకుతూ తిరుగుతూనే ఉన్నాను. ఆమె, నన్ను ఆక ర్షించటమేకాదు, నా పట్ల సుముఖంగా కూడా ఉన్నది. ఆ సౌందర్యమూర్తి మళ్లీ నాకు కనిపించదేమో అని పించింది! వెధవ చెప్పులకోసం ఆలస్యం చెయ్యకుండా అలానే ఆమెను వెంబడించిఉంటే, తర్వాత చెప్పుల సంగతి చూచిఉండవచ్చుకదా! అవెక్కడికిపోతాయి? అంగడివాని పూచీ ఉండనే ఉంది వాటికి! కాని బుద్ధి అలవాటు ప్రకారం దానికి తెలిసిన విలువని అది అన్వే షించింది!! ఉవ్వెత్తుగా నాలో అసంతృప్తీ, ఏదో పోగొట్టుకున్నట్లు ఆవేదనా కలిగాయి. రాత్రి చాలసేపు ఆమె జ్ఞాపకం వస్తూనే వున్నది. ఆ అపరిచిత వ్యక్తికి నామీద ఆసక్తి ఏమిటి? నాలో ఏ ప్రత్యేకతాలేదే! కాని ఆమె నా వెనుకనే నడవటంలో, నన్ను చూపు లతో పలకరించడంలో తప్పకుండా ఆసక్తి ఉన్నది! ఏమైతేనేం, అవకాశం చేజారిపోయింది!

రెండవరోజు ప్రొద్దున మళ్లీ ఆలయానికి వెళ్లాను. ఈసారి చొక్కా బనీను ఏమీ వేసుకోకుండా పట్టుఅంగవస్త్రం పైన కప్పుకుని, పంచె గోచీపోసి కాకుండా తమిళులలాగా అడ్డపంచగా కట్టుకునివెళ్లాను. ప్రొద్దుటి అర్చనకు ఎంతోమంది ఆడవాళ్లూ, మగ వాళ్లూ వచ్చారు. అర్చకునితోబాటు స్తోత్రపాఠాలు, నామావళీ అందరు బిగ్గరగా గొంతు కలిపి చదివారు. ఇది క్రొత్తగాఉంది. కాని ఎంతో బాగా ఉన్న ట్లనిపిం చింది. నాకూ ఆ శ్లోకాలూ, నామాలు రాకపోవటం కొరతగాఉంది. వాళ్లతో గొంతు కలపలేకపోయావే అనుకున్నాను. అర్చన ముగియగానే జనమంతా ఎక్కడి వాళ్లక్కడ గబ గబ వెళ్లిపోయారు. నాకు అర్థమైంది. వీళ్లు రోజూ ఇలా ఒక్క అరగంట ఆలయంలోకివచ్చి అర్చించి వెళ్లిపోతూ ఉంటారు.దేవాలయానికీ చుట్టూ ఉన్నవారికీ ఇంతగా దైనిక సాన్నిహిత్యం ఏర్పడిఉన్నదా అని ఆశ్చర్యపడ్డాను. దూరంనుంచీ వెళ్లే మనకు ఎక్కడో ఉన్నట్లు అపురూపమేకాని, ఇక్కడివాళ్లకు మానాక్షి ప్రత్యక్ష దేవతేకదా! అనుకున్నాను.

క్రిందటి సాయంత్రం చూచిన యువతి కని పిస్తుందేమోనని ఆశించి వెదికాను, కనిపించలేదు.

ఆలయంనుంచీ హోటలుగదికి తిరిగివచ్చి మామూలు దుస్తులు వేసుకుని బజారువైపు వెళ్లాను. నేను చదువుకునేందుకు ఉపయోగించే కళ్లద్దాల ఫ్రేము విరిగింది. క్రొత్త ఫ్రేము వేయించాలని వెళ్లాను.

ఒక కళ్లద్దాల అంగడిలో ప్రవేశించాను. అంగడి యజమాని ఒక యువతికి కళ్లద్దాల ఫ్రేములు చూపిస్తూ మాట్లాడుతున్నాడు. ఆమె అతనికి ఎదురు గుండా కుర్చీలో కూర్చుని టేబిల్‌మీద ఉన్న అద్దాల ఫ్రేములు చూస్తున్నది. నేను వెళ్లి యజమానికి కుడివైపున ఉన్న కుర్చీలో కూర్చున్నాను. తలవంచు కుని ఫ్రేముల్ని పరీక్షిస్తున్న ఆ యువతి నావైపు చూచింది. నేను చకితుణ్ణయ్యాను. ఆమే ఈమె! జారి పోయిందనుకున్న అవకాశం మళ్లీ లభించింది!

ఇప్పుడు ఆమెనుగూర్చి మరికొన్ని సంగతులు నాకు తెలిశాయి. ఆమె యింగ్లీషు చదువుకున్నది. బహుశా ఉద్యోగిని. ఆమె రెండు ఫ్రేములను ఎన్నుకొని, ఆ రెండింటిలో చివరకు ఏది తీసుకోవడం? అన్న మీమాంసలో పడ్డది. అంగడి యజమానిని సలహా అడిగింది. అతను రెండింటిని గూర్చి ధారాళంగా చెబుతున్నాడు గోడమీద పిల్లి వాటంగా. దేనికదే చక్కగా సరిపోతుందనిఅంటూ నిర్ణయాన్ని ఆమెకే వదిలే ప్రయత్నంలో ఉన్నాడు. నేను కల్పించుకుని అందులో ఒకదాన్ని గూర్చి, అదే బాగుంది అన్నాను. ఆమె నా వైపుచూచి, అంగడి వానితో, 'అయితే దీనికే ఫిక్స్ చెయ్యండి. నాకు ఇప్పుడే కావాలి. తల నొప్పిగా స్ట్రెయిన్‌గా ఉంది' అన్నది. 'కనీసం

రెండు గంటలు వ్యవధి కావాలి. చూడండి మా అసి స్టెంటు ఇంతదాకా రాలేదు!' అన్నాడు అంగడి వాడు.

నేను నా ఫ్రేముకోసం చూస్తున్నాను. అంగడి వాడు నా పాత ఫ్రేము తీసుకుని సైజునుబట్టి ఏవో రకాలు చూపిస్తున్నాడు.

'ఎట్లాగైనా చేసి ఒక గంటలో యివ్వండి. లేకపోతే నేను ఈ పూట కాలేజి మానేసుకోవాల్సి వస్తుంది' అన్నదామె.

'సరే' నన్నాడు అంగడివాడు.

ఆమె వెళ్లడానికి లేచింది.

నేను కూడా చప్పున లేచి 'అయాం సారీ, నేను యిప్పుడే మళ్లీ వస్తాను. నా పాత ఫ్రేము మీ దగ్గరే ఉంచండి. ఒక అరగంటలో వచ్చి సెలక్టు చేసుకుంటాను' అన్నాను అంగడి వానితో. అతను ఆశ్చర్యంగా చూస్తూ 'సరే' అన్నాడు.

ఆమె వెనకాలే నేను బయటికి వచ్చాను.

ఆమె కొంత దూరం నడిచి ఒక అంగడిలోకి ప్రవేశించి రెండు పెన్సిళ్లు కొన్నది. నేను వెంబడి వెళ్లి బ్లేడ్లు ఒక ప్యాకెట్ కొన్నాను. అక్కడినుంచీ మళ్లీ బయటికి వచ్చాము ఒక్కసారే. వస్తూండగా నా వైపు చూచి ఆమె అన్నది ఇంగ్లీషులో—

'మీ రిక్కడి వారు కారు?'

'అవును. నెల్లూరు.'

'ఏం పనిమీద వచ్చారు?'

'ఊరికనే... అనాలోచితంగా.... ఒంటరిగా'

'నా వెంట వస్తున్నా రెందుకూ?

'నిన్న ఆలయంలో చూచాను మిమ్మల్ని'

'చూస్తే?'

'మిమ్మల్ని పలకరించాలనిపించింది.'

ఆమె మౌనంగా నడుస్తూ ఉంది.

'మీరు కాలేజిలో లెక్చరరా?' అని ప్రశ్నించాను. సమాధానం లేదు.

'క్షమించండి. మీ కభ్యంతరం లేకపోతే, ఇక్కడ ఆగి నాతో కాఫీ త్రాగి వెళ్లండి' అంటూ కనిపించిన రెస్టారెంట్ వైపు దారితీశాను. ఆమె అభ్యంతరం చెప్పకుండా నాతో వచ్చింది. నా హృద యం ఉత్సాహంతో గంతులు వేసింది.

కాఫీలు తెమ్మని సర్వరుతో చెప్పాను. ఆమె నిమ్మళంగా గంభీరంగా నా వైపు చూస్తూ ఎదురు గుండా కూర్చున్నది. చిరునవ్వులేదు, మాటలేదు. ఎటువంటి తొట్రుపాటు లేదు. నా కేదో క్రొత్తగా వింతగా ఉన్నది. ఆమె గాంభీర్యం ముందు నేను అల్పుణి గా తోచింది. ఏమీ మాట్లాడ లేక పోయాను. కాఫీలు వచ్చాయి. కాఫీ త్రాగటం అయిపోతే ఆమె వెళ్లిపోతుంది. ఆమెతో ఏదో మాట్లాడాలి. ఏం మాట్లాడాలి?

ఆమె కాఫీవైపు దృష్టి మళ్లించింది. ఆమె వ్యక్తిత్వాన్ని పరివేష్టించి ఉన్న ప్రశాంతత నన్ను అధీరుణ్ణి చేస్తోంది.

పరస్త్రీల నెరుగని అమాయకుణ్ణి కాను. నా వయస్సు నలభై. నాకు కొన్ని అనుభవాలున్నాయి. కాని నా భార్య పోయిన తర్వాత, ఈ రెండేళ్లలో, నేను స్త్రీని గూర్చి ఆలోచించలేదు. ఇప్పుడు ఎదు రుగా ఉన్న ఈ యువతి నన్నాకర్షిస్తున్న తీరు విశి ష్టంగా ఉన్నది. కేవలం స్త్రీ వాంఛగా పోల్చుకో డానికి వీల్లేదు.

"మీరు కాలేజిలో ఏ సబ్జెక్టు చెబుతారు?" అన్నాను.

'ఫిలాసఫీ'

"మీకు సొంత ఫిలాసఫీ అంటూ ఏమైనా ఉన్నదా? మీది మెటీరియలిజమా, డైలెక్టికల్ మెటీ రియలిజమా, ఎగ్జిస్టెన్షలిజమా, వేదాంతమా, అద్వైతమా, ద్వైతమా?'

'అద్వైతం'

'నేనూ ఫిలాసఫీ గ్రాడ్యుయేటునే. ఇరవైఏళ్ల క్రితం. ఈమధ్య ఎప్పుడూ అనుకోలేదు దానిమాట. అన్నీ మరచిపోయి, కేవలం ఒంటరితనంలో గడపాలని యిక్కడికి వచ్చిన తర్వాత యిప్పుడు మళ్లీ ఆ ఫిలా సఫీ జ్ఞాపకం వస్తున్నది. ఏం తోచటంలేదు కాబట్టి! నాకు ఏ ఫిలాసఫీలోనూ, వేదాంతంలోనూ నమ్మకం లేదు.......మీరు నమ్మకం కల్గించగలరా?'

సమాధానంలేదు. ఆమె కాఫీ పూర్తిచేసి, వాచీ చూచుకొన్నది. నా కాఫీ కూడా పూర్తయింది. ఇద్దరమూ బయటికి వచ్చాము.

'థాంక్స్' అంటూ ఆమె అటువచ్చిన రిక్షాలో ఎక్కింది.

నాలో ఆతురత. ఆమె వెళ్లిపోతూవుంది.

'మీపేరు?' అన్నాను.

'మీనాక్షి'

రిక్షా వెళ్లిపోయింది.

నేను వూరుకోలేదు. మళ్లీ ఆమెను వెంటనే కలుసుకోవాలన్న కాంక్ష ప్రబలంగా వుంది. కళ్లద్దాల షాపుకేసి నడిచాను.

నాకు కావలసిన ఫ్రేము సెలెక్ట్‌చేసి, వెంటనే ఫిక్స్ చెయ్యమనీ, ఎంతసేపైనా అక్కడే వేచి ఉంటాననీ చెప్పాను. ఒక గంట కూర్చున్నాను. అద్దాలులేవు కాబట్టి న్యూస్‌పేపరు చదవటానికీ వీలులేదు. ఆలోచనలు, ఊహలు. మీనాక్షిని గూర్చి తలపోతలు. ఆమె ఏ క్షణమైనా తన కళ్లజోడుకోసం అక్కడికి వస్తుందని ఆశతో కూర్చున్నాను.

నా జోడు తయారైంది. గంట $11\frac{1}{2}$ అయింది. మీనాక్షి రాలేదు! ఇక అక్కడ ఉండటానికి నాకు కారణమూలేదు!

"ఆ లెక్చెరరుగారి జోడు తయారైందా?" అని అడిగాను.

"ఆ.....ఏదీ ఆమె రాలేదే! ఈ ఆడవాళ్లింతేనండీ! ఏదో ముంచుకుపోయిన అర్జంటు అంటారు. తీరా రెడీచేస్తే మూడురోజులకిగాని వచ్చి తీసుకోరు!" అన్నాడు అంగడి యజమాని.

నేను కాళ్లీడ్చుకుంటూ లాడ్జికి బయలుదేరాను.

సాయంకాలము దేవాలయానికి వెళ్లాను, అంగవస్త్రము, అడ్డపంచ ధరించి. అంగవస్త్రాన్ని నడుముకి చుట్టుకుని అర్ధనగ్నంగా లోపలికి వెళ్లాను. మీనాక్షీదేవి సౌందర్యమూర్తి. ఆమె నిలుచున్నతీరే విలాసంగా ఉంది. ముంజేతి చిలుక ఏ క్షణాన్నో ఎగిరిపోయేలా ఉన్నది. ఇంతటి శృంగారమూర్తిఅయిన దేవీ విగ్రహాన్ని నే వెక్కడా చూడలేదు. స్త్రీ సౌందర్యానికే ప్రతీక అనిపించింది. జన సమ్మర్దంవల్ల చాలసేపు చూస్తూ ఉండిపోవడానికి వీల్లేకపోవడం ఒక దురదృష్టం. ఆమె సాన్నిధ్యంనుంచీ బయటికివచ్చి ఏమీ తోచక ఇట్టట్టు తిరిగి పుష్కరిణి దగ్గరకువచ్చి కూర్చున్నాను.

పరధ్యానంగా కాస్సేపు నీళ్లనూ, కాస్సేపు దేవాలయాన్నీ చూస్తూ కూర్చున్న నాకు కుడివైపు ఎదురుగా మెట్లమీద, దూరాన మీనాక్షి కనిపించింది. ఎప్పుడు వచ్చిందో, ఏమో! అద్దాలు పెట్టుకున్నది. కూర్చుని తదేకంగా ఏమిటో ఆలోచిస్తూ ఎటో చూస్తున్నది. నాలో ఆవేగం హెచ్చింది. లేచి ఆమె దగ్గరకు వెళ్లాను. ఒకవైపు "ఏమిటీ కుర్రతనపు వేషాలూ? ఆమె ఏమనుకుంటుందీ?" అన్న హెచ్చరిక విమర్శ నాలో తలెత్తినా, దాన్ని గమనించే స్థితిలో లేను.

వెళ్లిచేరవగాఆమెకు కొంత ఎడంగానేఅయినా, దగ్గరగానే కూర్చున్నాను. ఆమె నా వైపు చూచి, గుర్తింపుగా చిరునవ్వు నవ్వింది. చిరాకుపడలేదుకదా అని సంతోషించాను.

"ఎలా ఉంది ఆలయం?" అని ఆమే పలకరించింది ఇంగ్లీషులో.

"బాగుంది. ఎంతో బాగుంది. ఈ పుష్కరిణి కూడా చక్కగా, ఎంతో నిర్మలంగా ఉంది."

"ఆలయానికి పుష్కరిణే ప్రాణం, మనిషికి హృదయంలాగ."

"మీరు మేధస్సుకంటె హృదయానికే, ఆలోచవకంటె ఆవేశానికే ప్రాధాన్యం ఇస్తారా?"

ఏదో ఒక విషయం ఎత్తుకుని మాటలు పెంచి తీరాలన్న కోరిక నాలో ప్రబలంగా ఉంది.

"అవును. లేకపోతే ఇక్కడికిరావటం ఎందుకు?"

ఆ మాట నాలో ఆలోచనని పురికొల్పింది. ప్రొద్దున్న ఆమె తాను స్వయంగా 'అద్వైతి' నన్న విషయం గుర్తువచ్చింది. చదువుకున్నది. తెలివిగలది. చక్కని సంస్కారం. ఎటువంటి తొట్రుపాటూలేని నీటైన హావభావాలు, అన్నింటినీ మించిన—నన్ను ఆకట్టుకొన్న—సౌందర్యం. నాలో ఎన్నడూ కలుగని ఒక పరిపూర్ణమైన సంతృప్తి కలుగుతున్నది ఆమెను చూస్తే. ఇంతటి పరిపూర్ణమైన స్త్రీమూర్తి కనిపించడం నిజంగా అరుదే!

"అద్వైతంలో ఆవేశాని (Feeling) కంటె ఆలోచనకే ప్రాముఖ్యం అనుకుంటానే! భక్తి ప్రపత్తుల కంటే జ్ఞానందే పైచేయికాదా?" అన్నాను.

"కాదు! మీనాక్షీదేవి ఎలా ఉంది?"

ఇక్కడ నేను కొంత చనవు తీసుకోదలిచాను.

"ఏ మీనాక్షీదేవి?" అన్నాను కొంటెగా.

"ఏదైనా ఫరవాలేదు. రెండూ ఒకటే!" అని సమాధానం వచ్చింది.

ఆ గరువపు మాటకు క్షణంసేపు చకితుడనై మళ్లీ ప్రేముగ్ధుణ్ణయ్యాను. ఇక్కడ గరువమేకాదు, అద్వైతపరంగానూ సముచితంగానే ఉన్న దామాట అనుకున్నాను.

"ఏమిటాలోచిస్తున్నారు?రూపంలేనిది భావమూ, భావం లేనిది రూపమూలేవు. నామంకూడా రూపంతోపాటే! నామం, రూపం మీలో కలిగించే భావమే ప్రధానం. అయినప్పుడు మీనాక్షి ఒకటే, రెండు కాదు!"

ఈ తర్కానికి నా బుర్ర తిరిగిపోయింది.

"అదెట్లాగంటారు?అక్కడ విగ్రహం, ఇక్కడ మనిషి. సౌందర్యంలో సాదృశ్యం ఉందనుకున్నా, నాకు విగ్రహంకంటె మనిషే ప్రిఫెరెన్స్."

"అదే భ్రమ, మాయ, అజ్ఞానం. రెండు లేవు ఒకటే ఉంది. ప్రిఫెరెన్స్ లేకపోవడమే సమదృష్టి. అంటే సౌందర్యమూ, సౌందర్యరాహిత్యమూ అనే అనుభూతి విచక్షణ లేకపోవడంకాదు, అనుభూతిలో ఏకత్వాన్ని చూస్తూ భిన్నంగా కనిపించేసృష్టి మాయకు లోను గాకపోవడం."

"సృష్టి, జగత్తు, మాయ, వట్టిది అంటారు కదా! అలా అనుకుంటే అది కలిగించే భావాలూ, కల్పించే ఆశలూ, మాయేఅయి, వాటిని దాటి ఏదో అవాఙ్మానసగోచరమైన ఆత్మ స్వరూపాన్ని పొందడం అద్వైతం అంటారు. మరి అద్వైతం లోకనిరాసం చెయ్యటంలేదా?"

"నామరూపాలూ, అవి కల్పించే భావాలూ, ఆశలూ వేరు వేరుగా లేవు. అవి అన్నీ ఒక్కటే, అదే సత్యం. వైవిధ్యమే మాయ. 'సృష్టిని మాయ' అంటే సృష్టి లేదనికాదు. సృష్టి అంటే ప్రకృతి, అనాదీ, అనంతమే. పుట్టుక, చావు అనేవి ప్రతి జీవికీ ఉన్నా, సృష్టి మొత్తానికి మాత్రం ఒక్కసారి పుట్టుక, ఒక్క సారి చావు అనేవిలేవు! సృష్టి లక్షణం మార్పు. ఈ మార్పునుకాదని అనుభూతి ఏకత్వాన్ని పొందటమే 'అద్వైతం' చెబుతుంది. ఈ లోకం వట్టిదనీ, గట్టిది వేరే ఎక్కడో ఉంది వెదకమనీ చెప్పదు. ఈ సంగతి సరిగా అర్థం చేసుకోవడంలోనే కీలకం ఉన్నది. వైవిధ్యం వట్టిది, ఏకత్వం గట్టిది అంతే."

"అయితే వైరాగ్యం మాటేమిటి? జీవితాను భూతిపట్ల వైముఖ్యంకాదా వైరాగ్యం అంటే?"

"కాదు. వైరాగ్యం అంటే ఇందాకా చెప్పినట్లు ప్రిఫెరెన్స్ లేకపోవడం. అదే సమదృష్టి.

"అయితే నాకు వైరాగ్యంలేదు! నేను విగ్రహాని కంటె మనిషినే ప్రిఫెర్ చేస్తాను!" అన్నాను నవ్వుతూ. అంతటితో ఆగకుండా, "ఇలాంటి దేవాలయాలు కట్టే దానికంటె డాములూ, ప్రాజెక్టులూ కట్టితే ఎంత ప్రజోపయోగం! అదే ప్రాచీనులకూ మనకూ దృక్ప థంలోగల భేదం.! నెహ్రూ, ప్రాజెక్టులనే నేటి దేవా లయాలు, అన్నాడు. ఎంత గొప్ప మాట! నాకు ఆధ్యాత్మికతకంటె జీవితంమీదే ఎక్కువ అభిమానం!" అన్నాను.

"రెండింటికీ భేదంలేదు. ఆనాడు విగ్రహమూ మనిషీ ఒక్కటి. ఈనాడు యంత్రమూ మనిషీ ఒక్కటి. ఇది మనిషిలోకాదు మనుష్యుల ఊహలో నేడు వచ్చిన మార్పు. ప్రిఫెరెన్స్. ఇప్పటికీ వైయక్తికంగా మనిషి తనవంటి విగ్రహాన్నే ప్రిఫెర్ చేస్తాడు! గాంధీకి నెహ్రూకి ఊరూరా ఇన్ని విగ్రహాలెందుకూ? ఆ డబ్బుతో ప్రాజెక్టులు కట్టరేం? మీరు మధురఎందుకు వచ్చినట్లు?"

నేను సమాధానం చెప్పలేదు. ఆమె బుద్ధి నైశిత్యాన్ని మెచ్చుకుంటూ ఆమె మాటల్ని అవగాహన చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నాను.

అవును. నేను మధుర ఎందుకు వచ్చినట్లు? నన్ను నేనే ప్రశ్నించుకుంటున్నాను. సహేతుకంగా చెప్ప దగిన సమాధానమేమీలేదు!

"నేను మధుర వచ్చింది మిమ్మల్ని కలుసు కోవటానికే" అన్నాను రొమాంటిక్‌గా.

"కావచ్చు" అన్నదామె గంభీరంగా, నాతో ఏకీభవిస్తూ. అలా అనడంలో నవ్వులేదు. హాస్యధోరణి అన్న సూచనలేదు. ఆమె 'సీరియస్‌నెస్' నాలో కించిత్ భయాన్ని కూడా కలిగించింది. ఆమె మామూలు వ్యక్తి కాదని తోచింది.

ఇంతలో ఎవరో ఒక అరవై ఏళ్ల ముత్తైదువ అక్కడికి రావడంచూచి మీనాక్షి లేచి ఆమె దగ్గరకు వెళ్లింది. "వెళ్తా"నని నాకు చెప్పనైనాలేదు. ఇద్దరూ వెళ్లిపోతున్నారు. మీనాక్షి నావైపు తిరిగైనా చూడలేదు! అలా నా మానాన నన్ను వదలి వెళ్లిపోవటం, ఇంతసేపూ మాట్లాడిన గుర్తైనా లేకుండా ప్రవర్తించడం నాకు బాధ కలిగించింది. నేను వాళ్లవెనుకే నడిచాను.

ఎలాగైనా మీనాక్షి వెంబడేవెళ్లి ఆమె యిల్లు కనుక్కోవాలనుకున్నాను.కాని నిన్నటి అనుభవం గుర్తుకు వచ్చింది. తీరా నా చెప్పుల్ని నేను వెదుక్కునేంతలో ఆమె మళ్లీ అంతర్ధానం కావచ్చు! అప్పుడు గతేమిటి? నాకు వెంటనే ఒక ఊహ తట్టింది. నేను గబగబా ముందుకు నడిచాను. మీనాక్షినీ ముసలావిడనీ దాటి వెళ్లిపోయాను. వెళ్లి నా చెప్పుల్ని తొడుక్కుని ద్వారం దగ్గర కాపలా వేశాను.

ద్వారం దగ్గరకు రాగానే, నా ఆత్రాన్ని గమనించినట్లుగా, మీనాక్షి నన్ను చూచి చిరునవ్వు నవ్వి తల పంకించింది. తన వెంట రమ్మన్నట్లుగా నాకు నేను అర్థం చెప్పుకుని వాళ్లతోపాటు వెనుక నడిచాను.

దేవాలయపు వీధికి అవతలివీధిలో ఒక చిన్నమేడ దగ్గర వాళ్లు ఆగారు. నేను కూడా ఆగాను. ముసలావిడ తలుపు తాళం తీసింది.

ఆ కమ్ముల తలుపు దాటగానే నడవ, దాని కుడి ప్రక్కన మేడపైకి మెట్లు ఉన్నాయి. ముసలావిడ నడవదాటి తలుపు మరో తాళం తీస్తున్నది. మీనాక్షి మేడపైకి దారితీస్తూ, నన్ను రమ్మన్నది.

పై భాగానికి మరోతాళం ఉన్నది. మీనాక్షి దాన్ని తీసే ప్రయత్నంలో ఉండగా—"ఆమె మీ అమ్మగారనుకుంటాను" అన్నాను.

సమాధానం రాలేదు.

లోపలికి వెళ్లాము. పుస్తకాల బీరువా, కుర్చీలు. నేనొక కుర్చీలో కూర్చున్నాను. మీనాక్షి లోపలి గదుల్లోకి వెళ్లి, కాస్సేపటిలో వచ్చింది.

"ఆమె ఎవరో చెప్పలేదు" అన్నాను.

"జ్ఞానాంబ. ఆమె యింటిలో నేను అద్దె కుంటున్నాను. ఒకవిధంగా అత్తగారు."

"పంజరంలో చిలుకలాగ? అబ్బ! ఎన్ని తాళాలు" అన్నాను.

"శరీరంలో ఆత్మలాగ! మూడు తాళాలు. ఆమె తీసినవి రెండూ, నేను తీసినది ఒకటీ. వేదాంతంలో త్రిపుటి అంటే దృశ్యము, దృష్టి, ద్రష్ట."

ఆమె వేదాంతంలోకి దిగడం నాకు ఆసక్తి కలిగించలేదు. ఇంతదాక చేరుకున్న తర్వాత శుష్కమైన ఆ చర్చ అనవసరం అనిపించింది. అంతకంటె గట్టిదేదో నన్ను పట్టుకొన్నది. అంతా స్వప్నంలా ఉన్నది.

"ఇంకెవరూ లేరా?" అన్నాను.

"ఎవరికి వాళ్లం ఒంటరివాళ్లం. ఎవరో ఉన్నారనుకోవడం భ్రమ."

"జ్ఞానాంబతో నన్ను గురించి ఎవరని చెప్పారు" అన్నాను కుతూహలంగా.

"వ్యాపారస్థులని. నాకోసం వచ్చారని."

నిజమే! కాని నేను వ్యాపారమే చేస్తాననీ, ఉద్యోగినో, మరోవృత్తివాణ్ణోకానని ఈమె కెలా తెలిసిందీ! నేను చెప్పినట్టు గుర్తులేదు. ఆమాటే అడిగాను.

"మిమ్మల్ని చూస్తే తెలీడం లేదా?" అంటూ నవ్వింది.

ఆ సమాధానానికి కొంత అప్రతిభుడనయ్యాను. వ్యాపారం అనేది నా మొహమ్మీద అంత స్పష్టంగా వ్రాసి ఉందా! నేను చిన్నబుచ్చుకున్నాను.

ఆమె మళ్లీ లోపలికి వెళ్లింది.

ఏమీ తోచటంలేదు! నా చుట్టూ పరిశీలనగా చూశాను. కొంతదూరంలో ఒక టేబిల్‌మీద రమణ మహర్షి ఫోటో కనిపించింది. దగ్గరకువెళ్లి చూశాను. నన్ను దయతో వాత్సల్యంతో చూస్తున్నట్లున్నది ఆయన చూపు. నాలో ధైర్యం, ఉత్సాహం కలిగాయి. సాహసం యినుమడించింది.

ఆమె కాఫీ పట్టుకొచ్చింది. తలనిండా మల్లెలు తురుముకొన్నది. చీర మార్చి తెల్లని చీర కట్టుకొన్నది. దేవతలా మనోజ్ఞంగా ఉన్నది.

కాఫీ త్రాగుతున్నాను. అమృతంలా ఉన్నది. కాఫీ చెయ్యడంలో దక్షిణాది తమిళులకున్న అభినివేశం మరొకరికిలేదుకదా!

"మీరు మధురకు ఎందుకు వచ్చారు?" అని ప్రశ్నించింది.

నాకు హృదయం విప్పి చెప్పాలనిపించింది. చెప్పాను. జీవితం అర్థంకాక, స్వేచ్ఛకోసం, శాంతి కోసం, ఆనందంకోసం, అనుభూతికోసం, ఏమిటోతెలీని దానికోసం, వచ్చాను అని చెప్పాను. కాఫీ పూర్తిఅయింది.

"మీ భార్య?"

"లేదు"

"అంటే?"

"పోయింది. చనిపోయింది. రెండేళ్లయింది."

"వ్యక్తి చనిపోవచ్చు. ఆ భావం మీలో పోలేదుగా."

"చెప్పలేను. రెండేళ్లుగా నాలో వాంఛలేదు. నాలో ఏదో మార్పు వచ్చింది. చనిపోయిన నా భార్యను గూర్చి కూడా వాంఛతో దుఃఖించలేదు. ఎన్నాళ్లనుంచో జీవితం గతానుగతికంగానే జరుగుతూ వచ్చింది. కాని సౌందర్యం, మీలో నేను చూస్తున్న సౌందర్యం, దాన్ని ఆరాధించకుండా ఉండలేను!"

"సౌందర్యం అంటే?"

"అంటే ఇష్టం. పరమమైన యిష్టం"

"అంటే?" ఇష్టం అంటే? ఇంకా లోతుకు వెళ్లితే? ఆలోచించాను.

"నేను! ఆ యిష్టమే నేను! అంతకంటె ఏం చెప్పగలను?" అన్నాను.

"చివరకు మిగిలేది ద్రష్ట. అయితే మీరు మధురకు వచ్చింది మీ కోసమేనా?" అన్నది నవ్వుతూ. వేదాంతం ఒక 'గేమ్'లా తయారైందే అనుకున్నాను.

"కాదు. మీనాక్షికోసం" అన్నాను.

"నిజంగా?"

"నిజంగా"

"అదేనా సత్యం?"

"ఆహా!"

"అయితే రండి."

తర్వాత ఏంజరిగిందో మాటల్లో చెప్పలేను. చెప్పటానికి మాటలులేవూ, చాలవూ కాబట్టి. అక్కడ ఎంత సేపున్నానో, గుర్తులేదు. ఒక మహదానందంతో తాదాత్మ్యంతప్ప మరొక స్పృహలేదు. గది తలుపు తట్టుతూ ఎవరో పిలుస్తూఉండగా నాకు మామూలు స్పృహ వచ్చింది. లాడ్జికి ఎప్పుడు తిరిగి వచ్చానో గుర్తులేదు. నా గదిలో మంచంమీద పడుకుని ఉన్నాను. లేచి తలుపు తీశాను.

"సార్ భోజనం తెమ్మంటారా?" అంటున్నాడు హోటలు కుర్రవాడు.

"వద్దు. ఇప్పుడు టైం ఎంతైంది?"

"మీ దగ్గర వాచీలేదా సార్?"

అవును. ఏమిటి నాప్రశ్న! చేతికిఉన్న గడియారం చూస్తే ఎనిమిది గంటలైంది.

"ఇప్పుడు ఎనిమిదేనా టైం?" అన్నాను సందేహంతో.

"అవును సార్"

"సరే, నాకేమవసరంలేదు"

తలుపు వేశాను.

ఎప్పుడు నిద్రపోయానో, ప్రొద్దున లేచేప్పటికి ఏడు గంటలు దాటింది. ఆకలిలేదు. ఏమి చెయ్యాలనీలేదు. ఏదో నిండుదనం, ఎన్నడూ ఎరగని సంతృప్తి, నిశ్చలత్వం.

బలవంతాన లేచి స్నానం వగైరా ముగించాను. కాఫీ త్రాగాను. న్యూస్‌పేపర్ వచ్చింది. కాని నామనస్సు న్యూస్‌పేపర్‌మీదలేదు.

ఆమె ఎవరు? 'సెక్స్' లో యింతటిమైకం, ఇంతటి సుఖానుభూతి ఉంటాయని నే నెన్నడూ ఊహించలేదు. రాత్రిఅంతసేపు ఆమెతో మాట్లాడాను. కాని ఆమెను గురించిన వివరాలేమీ నాకు తెలీవు.

ఆమె ఉద్యోగంచేస్తూవుంది. ఒంటరిగానేవుంది. అవివాహితే కావచ్చు. ఆ విషయం కూడా నిర్ధారణగా నేను అడిగి తెలుసుకోలేదు! అయితే ఆమెకూ నాకూ ఏర్పడిన సంబంధం ఎటువంటిది? ఆమె నన్నేమీ

కోరలేదు. ఎక్కడా కోరుతున్న సూచన కూడా లేదు! ధార్మికమైన విచికిత్సపాడసూపనేలేదు.సంఘం, వ్యవస్థ, ముందు, వెనుక అనేవి ఉన్నాయా చచ్చాయా అనికూడా ఆలోచన రాలేదు! కోరగానే అంత అలవోకగా అంతటి ఆనందానుభూతి అలా ప్రసాదించిన ఆమె ఎవరు? ఆమె వ్యక్తిత్వం ఏమిటో పోల్చుకోలేకపోయాను!

ఆ సుఖానుభూతి స్మరించేకొద్దీ నా కళ్లు చెమర్చి, నా హృదయం ఎన్నడూ ఎరుగని కృతజ్ఞతా భావంతో నిండిపోతున్నది.

తర్వాత, తర్వాత.....ఆమెను వివాహం చేసుకొంటే.....అనే ఆలోచన ప్రారంభం అయింది.ఆమెను శాశ్వతంగా నాదాన్నిచేసి తీసికొనివెళ్లిపోవాలి అనే కోరిక కలిగింది. ఆమె ఎవరైనాసరే, ఆమెను గూర్చిన వివరాలేమైనాసరే,ఆమె నాకు కావాలి అనే దృఢ నిశ్చయానికి వచ్చాను. ఆ సాయంకాలం ఆమె యింటికివెళ్లి ఈ సంగతి తేల్చేసుకోవాలనుకున్నాను. అప్పటికి భోజనం వేళ దాటుతోంది. ప్రొద్దున త్రాగిన కాఫీ. కాని ఆకలి వెయ్యలేదు. హొటలు కుర్రవాడు, ''భోజనం చేశారా సార్'' అంటూ కనుక్కోవడానికి వచ్చాడు. భోజనం తీసుకు రమ్మన్నాను.

భోజనం తర్వాత మళ్లీ పడక, ఆలోచనలూ, నిద్రా.ఒక కల. అందులో నేను చచ్చిపోయాను. అంటే నా శవం నాకు కనిపిస్తూవుంది. ఎవరెవరో నా శవం చుట్టూ మూగివున్నారు. 'నేను' వేరై ఆ దృశ్యాన్ని చూస్తూ ఉన్నాను. నా కూతురు, చివరిది, ఏడేళ్ల గిరిజ ఏడుస్తూవుంది. దాన్ని ఓదార్చబోతూ, నేను చచ్చిపోలేదని నచ్చచెప్పటానికి ప్రయత్నిస్తూఉన్నాను. కాని దానికి నే నగపడటంలేదు, వినబడటంలేదు. అది నా శవాన్నే చూస్తూ ఏడుస్తూవుంది. ఏం చెయ్యడం? అని తర్కిస్తూ ఉన్నాను. నేను కదిలాను. మెలకువ వచ్చింది.

సాయంకాలమయింది. అయిదున్నరకు దేవాలయానికి వెళ్లాను. ఆమెకోసం గాలించాను. ఆమె రాలేదు. బయలుదేరి ఆమె యింటివైపు వెళ్లాను.

కమ్ముల తలుపు తెరిచివుంది. మెట్లెక్కి పైకి వెళ్లాను. తాళం వేసిఉంది. బహుశా కాలేజీనుంచి రాలేదో, వచ్చి ఎక్కడికైనా వెళ్లిందో! క్రిందికివచ్చి ఇంట్లోకి తొంగిచూశాను. ఒక కుర్రాడు బయటికి వస్తూ నన్ను చూచి ఆగాడు ప్రశ్నార్థకంగా.

''జ్ఞానాంబ?'' అన్నాను.

కుర్రాడు లోపలికి వెళ్లాడు. వృద్ధురాలు జ్ఞానాంబ వచ్చినది. ఆమె ముఖం మ్లానంగా ఉంది. ఆమె ఏదో కష్టంతో పరధ్యానంగా ఉన్నది.

''ఎవరు?''

ఆమె నన్ను గుర్తిస్తుందనుకున్నాను. గుర్తించలేదు.

''మీనాక్షిగారు. లెక్చరర్'' అన్నాను.

గద్గదికతో చేయి ఊపుతూ ''ఇంకెక్కడి మీనాక్షి ....పోయింది.....పోయింది....'' అన్నదామె.

నా కర్థం కాలేదు. అప్పుడు కుర్రాడు చెప్పాడు. రాత్రి తొమ్మిదిగంటలవేళ మీనాక్షి స్టవ్ వెలిగిస్తూ, చీర కొంగు అంటుకుని, దగ్ధమైపోయిందని. హాస్పిటల్లో పదకొండు పన్రెండు గంటల మధ్య ప్రాణం పోయిందట?

నాకు నోట మాట రాలేదు! అంతా మాయగా ఆశ్చర్యంగా తోచింది.

ఆమె దగ్ధ శరీరాన్ని బంధువులు—అన్న, తల్లి ఊరినుంచీ వచ్చి ప్రొద్దున టాక్సీలో తీసుకు వెళ్లిపోయారట!

నాకు తమిళం బాగా రాకపోవటం, ఇంగ్లీషులో కుర్రాడితో మాట్లాడటం గమనించి, జ్ఞానాంబ చివరకు అడిగింది, కన్నీళ్లు తుడుచుకుంటూ.

''మీ రెవరు? మీకు ఆమె ఎలా తెలుసు?''

''నిన్న దేవాలయం దగ్గర కలుసుకున్నాను. మీరు చూడలేదా?'' అని ఎదురు ప్రశ్నించాను.

''లేదే! మీనాక్షీ నేను దేవాలయానికి వెళ్లి ఇంచు మించు నిన్న ఈ వేళకు తిరిగి వచ్చాము. కాని మిమ్మల్ని చూడలేదే!'' అన్నదామె! చిత్రంగా లేదూ!

వాది నెల్లూరని చెప్పాను. కాని అలా చెప్పిన తర్వాత నాకూ మీనాక్షికీ గల సంబంధాన్ని గూర్చి ఏదో చెప్పక తప్పలేదు! ఆమె మా అమ్మాయికి లెక్చరరనీ, అలా పనివుండి వచ్చాననీ కల్పించి చెప్పాను.

''మీనాక్షికి భర్త, పిల్లలు లేరా?'' అని ప్రశ్నించాను.

భర్త నాలుగేళ్లుగా అమెరికాలో ఉన్నాడట. పిల్లలు లేరు. ఈమెను రమ్మని వ్రాసినా ఈమె వెళ్లలేదట......

ఇక అంతకంటె వివరాలు లభించలేదు. అడగడం కూడా భావ్యంగా తోచలేదు. అడిగితే నా రహస్యం బయట పడుతుందేమోనని భయంవేసింది.

నేను మీనాక్షి ఫోటో సంపాయించాలను కున్నాను. ఆమె పని చేస్తున్న కాలేజి ఏదో ఎవరి నడ గను? జ్ఞానాంబనుకాదు. నే నదివరకే మా అమ్మాయికి ఆమె లెక్చరరు అని చెప్పడంవల్ల, ఆ ప్రశ్న అక్కడ నిషిద్ధమైపోయింది!

తర్వాత మూడు రోజులపాటు ఆ ఊళ్లోని కాలేజీలు గాలించాను. వెళ్లి ప్యూన్లను, స్టూడెంట్సునీ, ఫిలాసఫీ డిపార్టుమెంటు సంగతీ, మీనాక్షి అనే లెక్చెరరును గురించీ వాకబు చేశాను. చివరకు యూని వర్సిటీ సెంటరులో నా కృషి ఫలించింది. ఫిలాసఫీ ప్రొఫెసర్ దగ్గరకువెళ్లి, నేను మీనాక్షి అన్నగారితరఫున వచ్చాననీ, ఆమె మరణం దృష్ట్యా ఆమె తాలూకు ఫోటో ఒకటి కావాల్సిఉందనీ చెప్పాను. ఆయన క్రిందటి సంవత్సరం విద్యార్థులతో తీసుకున్న గ్రూప్ ఫోటో చూపించారు. అందులోని మీనాక్షికి కళ్లద్దాలూ, ఏవో కొన్ని పోలికలూ ఉన్నాయికాని, నాకు తెలిసిన సౌందర్యమూ, స్ఫూర్తీ లేవు! ఆ ఫోటో తీసిన స్టుడియో అడ్రసు తీసుకుని వచ్చేశాను.

గ్రూప్ ఫోటోలోని మీనాక్షి బొమ్మను ఎన్లార్జ్ చేయించాను. కాని నేను చూచిన సౌందర్యరాశికీ, ఫోటో లోని బొమ్మకూ ఎక్కడా అందికా పొందికా లేవు!

ఈ అన్వేషణంతా ఒకవైపు చేస్తూనే, మీనాక్షిని గూర్చి నా అనుభూతిని గూర్చి తర్కిస్తూఉన్నాను. నాకు వివరంగా జ్ఞాపకం ఉన్నదల్లా పుష్కరిణివద్ద అద్వైతాన్ని గూర్చి ఆమె చెప్పిన మాటలే. ఆమె యింటిలో ఆమెకు నన్ను గూర్చి నేను చెప్పుకున్నదే ఎక్కువ. తర్వాత మిగిలినది అపూర్వమైన ఆనందాను భూతి, తాదాత్మ్యము, తప్ప మరొక వివరంకాని విశేషం కాని గుర్తులేదు! ఆటుతర్వాత ఆమె దగ్ధమై అంత ర్ధానమైపోవడం! జ్ఞానాంబ చెప్పిన వివరాలూ, ఫోటో వగైరాల ద్వారా ఏర్పడుతున్న మీనాక్షికీ, నా అను భూతిలో సత్యమై నిల్చిన మీనాక్షికీ ఎక్కడా పోలిక లేదు!

వివాహవ్యవస్థనుగూర్చి, ధార్మిక ప్రవర్తనను గూర్చి మీనాక్షి అభిప్రాయం ఏమిటి? ఆ ప్రశ్నలు నే నామెను వేయలేదు! కాని ప్రిఫెరెన్స్‌లేని విరాగి గానే ఆమె ప్రవర్తన నా కర్థమవుతున్నది. అను భూతిలో ఏకత్వాన్ని చూడమనే ఆమె నా కిచ్చినసందేశం. సందేశమేకాదు. నేనూ, నేను ఆశించిన సౌందర్యమైన తానూ, దాని అనుభూతీ, మూడూ నాకు ఏకం చేసింది, తర్వాత దగ్ధమైపోవడంలో, అనశ్వరమైన దాన్నీ నశ్వర మైన దాన్నీ వేరుచేసి చూపించినట్లుగా ఉన్నది. కాని నాలో హత్తుకుపోయిన విషయంమాత్రం ఒకటి ఉన్నది—అనశ్వరమైనది నశ్వరమై కనిపించే లోకం ద్వారానే మనుష్యునికి అందుతున్నది. అందుకుభిన్నంగా లేదు! అనే సూత్రం.

ఆలయంలోకి వెళ్లి మీనాక్షీదేవిముందు నిలు చున్నాను. ముంజేతిమీది చిలుక ఏ క్షణాన్నో ఎగిరి పోయేలా సుతారంగా అనిశ్చితంగా ఉన్నది. దేవి విలాసంగా, శృంగారాన్ని ఒలుకుతూ, ఆనందానుభూతికి ప్రతీకగా చిరునవ్వు నవ్వుతూ ఉన్నది.

మధురకు యిందుకా పిలిపించావు! అన్నాను, మనసులో ఆ దేవీమూర్తితో. ప్రత్యక్షమై, స్వయంగా అద్వైత బోధచేసి, అద్వైతానుభూతి ప్రసాదించి, నన్ను నీ దాసుణ్ణి చేసుకున్నావు! అంత అవ్యాజమైన ప్రేమ నీది! అంటూ ఏమిటో నివేదించుకున్నాను. ఆమె మాత్రం నవ్వుతూనేవుంది